స్నేహాన్ని, అభిమానాల్ని, ప్రేమను దేనితో కొలుస్తారు?
ఆర్థిక విలువలు మానవ సంబంధాల్ని పాడు చేస్తాయా?

నవలిక

# నీలి మేఘం

నందం రామారావు

## 4

''సరే నీ వాటా పాతిక లక్షలు. డ్రాఫ్ట్ తీసి ఇవ్వు. నాకు తెలిసిన వ్యక్తులున్నారు. వారి దగ్గర ఫారిన్ మెటీరియల్ తక్కువ రేటుకి దొరుకుతుంది. నువ్వీలోపు ఇక్కడ మంచి స్థలం కాని, బిల్డింగ్ కాని వుంటే కొని వుంచు. నా దగ్గరున్న ఐదు లక్షలు నీకిచ్చి వెడతాను.అది నీ దగ్గరుంచి అవసరానికి ఖర్చుపెట్టు''.

''అలాగే''

''ఇప్పుడే మనం ఆర్డరు బుక్ చేసుకుంటే, ఫారిన్ నుండి అవి వచ్చేసరికి ఆరు నెలలు పడుతుంది''.

''ఇంతకీ ఏం బిజినెస్?''

''చెప్పానుగదా. ఫారిన్ నుండి మెటీరియల్ తెప్పించి ఇక్కడ మనం స్పేర్ పార్ట్సు తయారుచేయడం. ఏం! ఈ బిజినెస్ నీకు నచ్చలేదా?''

''అబ్బే అదికాదు వూరికే అడిగాను''.

''ఈ బిజినెస్‌ని నువ్వే మేనేజ్ చేద్దువుగాని. మూడువంతులు లాభం నువ్వే తీసుకో'' అన్నాడు కిరీటి.

''కిరీటీ! నీ మేలు మర్చిపోను'' శశాంక ఆనందపడిపోయాడు.

''ఈ కృతజ్ఞతలు కాదు నాక్కావలసింది'' లాభాలు.

''నువ్వే మాస్తావుగా ఈ శశాంక ప్రజ్ఞ. కాని కిరీటీ!నాదొక్క కోరికరా?''

''ఏమిటది?''

''ఈ విషయం ప్రభాకర్‌కి తెలియనీకు''

కిరీటి పకపకా నవ్వాడు. నవ్వి-

''ఓస్ అంతేకదా'' అన్నాడు.

ఇంతలో నౌకరు 'టీ' పట్టుకొచ్చాడు.

''ఇప్పుడెందుకురా''

''తీసుకో మా వంటవాడు 'టీ' చెయ్యడంలో ఎక్స్‌పర్ట్'' అంటూ శశాంక ఒక పప్ప కిరీటి కందించాడు.

ఇద్దరూ టీ తాగారు.

''కిరీటీ! మా ఆఫీసు చూస్తావా?''

''ఓ.కె. నేను రెడీ''

''అయితే వుండు నేను డ్రస్ చేసుకువస్తాను'' అంటూ శశాంక లోపలి కెళ్ళాడు.

కిరీటి టేబుల్‌మీదున్న పేపరు చేతిలోకి తీసుకున్నాడు. పేజీ తిప్పి వార్తలు చదువుతున్నవాడల్లా ఒక మూలగా పెద్ద అక్షరాలతో వేసిన వార్తచూసి వులిక్కి పడ్డాడు. మళ్ళీ మళ్ళీ చదివాడు. మనసంతా శూన్యమయిపోయింది.

మెట్లమీద శశాంక బూట్లశబ్దం వినిపించింది.

కిరీటి సర్దుకుని కూర్చున్నాడు.

''వెడదామా?''

పేపరు టేబుల్‌మీద పెట్టి కిరీటి లేచాడు.

ఇద్దరూ బయటకు రాబోతుండగా పోర్టికోలో ఓ కారు ఆగడం, ఆ కారులోంచి ఓ స్త్రీ దిగడం జరిగాయి.

ఆమె గబగబా లోపలికొచ్చింది. ఆవిడను చూస్తూనే శశాంక ముఖం ముడుచుకుంది.

''శశాంకా! కిరీటి వచ్చాడటగా ఏడీ?'' అనడిగింది.

''నీ కెవరు చెప్పారు?''

''ఎవరో చెప్పారులే. కిరీటి ఏడి?''

వరండా ప్రక్కనుంచి చేతిలో గులాబీతో వస్తున్న కిరీటిని చూపుతూ- ''అదుగో కిరీటి'' అన్నాడు శశాంక.

ఆమె కిరీటికి దగ్గరగా వెళ్ళింది. అతన్ని పై నుంచి క్రిందివరకూ ఆశ్చర్యంగా చూస్తూ- ''కిరీటీ! ఎంత మారిపోయావు నువ్వు'' అంది.

'తెల్లగా, లావుగా విపరీతమైన అలంకరణతో చూడగానే జుగుప్స కలిగించే వస్త్రాలంకరణతో వున్న ఈవిడెవరు?' అనుకున్నాడు కిరీటి.

''కిరీటీ! నేనెవరో గుర్తుపట్టలేదా? సుధని'' అంది.

కిరీటి తెల్లబోయాడు.

సుధ అతనివేపే రెప్పవేయకుండా చూస్తోంది.

శశాంకకి చాలా చిరాగ్గా వుంది. ఈ సుధ ఇప్పుడే రావాలా అనుకున్నాడు.

''కిరీటి! మనం బయలుదేరుదామా?'' శశాంక అన్నాడు.

''ఎక్కడికి?'' సుధ అడిగింది.

''మా ఆఫీసు కిరీటికి చూపించాలని''

''అయితే పదండి నేనూ వస్తాను. మీ ఆఫీసు నుంచి మా ఇంటికెడదాం'' అంది సుధ.

శశాంకకు ఏం అనడానికి తోచలేదు.

ముగ్గురూ కారులో కూర్చున్నారు. శశాంక స్టీరింగ్ ముందు కూర్చున్నాడు. వెనుక సీట్లో కిరీటి, సుధ కూర్చున్నారు.

సుధ కిరీటిని తినేసేటట్లు చూస్తోంది.

''కిరీటి రేఖ చెబితే మొదట నమ్మలేదు''.

రేఖ మాటవిని శశాంక చటుక్కున వెనక్కి తిరిగి-

''రేఖ ఫోన్ చేసిందా?'' అనడిగాడు.

''అవును గంట క్రితం ఫోన్‌చేసి- మా ఇంటికి కిరీటి అంకుల్ వచ్చారు. అన్నయ్య ఫ్రెండ్, కోటీశ్వరులు. అన్నట్లు ఆయన మీక్కూడా క్లాస్‌మేట్ కదా అంది. అదివిని నేను ఆశ్చర్యపోతూ ఏవేవో ప్రశ్నలు వేశాను. ఆంటీ! అదంతా నాకు తెలియదు. మీరే వచ్చి చూడండి అంది. ఇక నేను ఆగలేక వచ్చేశాను'' అంది సుధ.

'మంచిపని చేశావులే' శశాంక మనసులో విసుక్కున్నాడు.

"కిరీటీ! ఇప్పుడెక్కడ వుంటున్నావ్?"

"బాంబేలో" శశాంక జవాబు చెప్పాడు.

సుధ చిరాగ్గా చూసింది.- "కిరీటీ! నువ్వు చాలా మారిపోయావు. ఇదివరకు సన్నగా వుండేవాడివి. ఇప్పుడు పొడుక్కి తగ్గ లావుతో ఠీవీగా, అందంగా వున్నావు" అంది.

కిరీటి నవ్వి వూరుకున్నాడు.

"మువ్వీ వూరు ఎప్పుడొచ్చావ్?"

"నిన్న"

సుధ ముఖం కోపంతో ఎర్రబడింది.

"నిన్ననగా వచ్చి నాకింతవరకు ఫోన్ చెయ్యలేదు. నన్ను పూర్తిగా మర్చిపోయావు కదూ?"

సుధ మాటలకి నవ్వాలో, ఏడవాలో అర్థం కాలేదు కిరీటికి. 'సుధ... సుధేనా ఇలా మాట్లాడేది? పదేళ్ళనాడు తనని దారుణంగా అవమానించిన సుధ ఈనాడిలా మాట్లాడుతోంది...


కిరీటి కళ్ళముందు ఆనాటి సుధ మెదిలింది.

** ** **

ఆనాడు సుధ సన్నగా, తెల్లగా , పొడుగ్గా సన్నజాజి మొగ్గలా వుండేది.

కిరీటి కాలేజీలో చదివేటప్పుడు సుధ కూడా అతని క్లాస్‌మేటే.






## నీలి మేఘం

ఆమెకు కిరీటంటే వెర్రిప్రేమ. అతన్ని ఆరాధించింది. అతని ప్రేమకోసం తపించిపోయింది. అతనికి ఎన్నో ప్రేమ లేఖలు రాసింది.

"కిరీటీ! నువ్వులేనిదే నేను బ్రతకలేను. నేను ధనవంతురాలనని, నువ్వు పేదవాడివని సంకోచించకు. ధనంకంటే ప్రేమ గొప్పది" అంటూ ఏవేవో వ్రాసేది.

కాని కిరీటి సమాధానం ఇచ్చేవాడు కాదు.

మూడు సంవత్సరాలు గడిచాయి. చివరిరోజు సుధ అతని దగ్గరకొచ్చి "వెడుతున్నానని" చెప్పింది.

కిరీటి మొదటిసారిగా తన మనస్సు విప్పి సుధకు చెప్పాడు–

"సుధా! మీకు ఇన్నాళ్ళూ సమాధానం ఇవ్వనందుకు ఏమీ అనుకోకండి.

"ఈ సంఘంలో నాకంటూ ఒక స్థానం ఏర్పరచుకున్న రోజున మీ దగ్గరకొచ్చి, మీ ఉత్తరాలకు జవాబు చెబుతాను" అన్నాడు.

సుధ ఆ మాటలు మౌనంగా విని వెళ్ళిపోయింది!

కిరీటి ఆశించినట్టు అతనికేస్థానం ఏర్పడలేదు. ఎటువంటి వుద్యోగమూ రాలేదు!

పదేళ్ళక్రితం హైద్రాబాద్ వొచ్చినప్పుడు శశాంక, ప్రభాకర్‌ని కలిశాక, సుధని కలిశాడు.

కాలేజీ రోజులనాటి సుధను తలుచుకుంటూ ఎంతో ఆశతో ఆమెదగ్గర కెళ్ళాడు.

అప్పుడు సుధ అన్న మాటలు కిరీటి ఈ జన్మలో మరచిపోలేనివి.

"కిరీటీ! తెలిసీ తెలియని వయస్సులో నిన్ను ప్రేమించానని భ్రమించాను. ప్రేమకు సరైన నిర్వచనం నాకిప్పుడు తెలిసింది. ఆనాటి నా స్థితి తలచుకుంటే నాకిప్పుడు ఎంతో నవ్వొస్తోంది. ప్రేమ అన్నం పెట్టదని, ప్రేమని తింటూ బ్రతకలేమని తెలుసుకున్నాను. నాకిప్పుడు డబ్బుకావాలి. నగలూ, కార్లూ, మేడా, పట్టు చీరలూ కావాలి. నువ్విస్తావా? చెప్పు? పెళ్ళి చేసుకుందాం" అంది.

ఆ మాటలతో కిరీటి తల తిరిగిపోయింది.

ఆ నాడు ఎన్నో ప్రేమ లేఖలు రాసిన సుధేనా ఇలా మాట్లాడేది?

"అది కాదు సుధా? చిన్న వుద్యోగమైనా..." తరువాత మాటలు పూర్తి


జూన్ 26 విడుదలలు

ఆంధ్రజ్యోతి-పద్మాలయ నవలానవమోహిని సస్పెన్స్ థ్రిల్లర్ పోటీలో బహుమతి పొందిన
హోతా పద్మినీదేవి
ఆంధ్రజ్యోతి సెన్సేషనల్ సీరియల్
*నీడలతో క్రీడలు
వెల: రూ. 25/-

మయూరి వారపత్రికలో సీరియల్‌గా ప్రచురింపబడ్డ అందాలతార
జయప్రద
ప్రేమించే వారికోసం అందించిన రొమాంటిక్ థ్రిల్లర్
*ప్రేమించుకుందాం
వెల: రూ. 20/-

నండూరి విఠల్
*సీతాపతీయం
వెల: రూ. 13/-
ఆంధ్రభూమి వారపత్రిక సీరియల్

కె. నిర్మల
*జీవనసమరంలో
వెల: రూ. 13/-

శ్రీమతి హరిచందన
*కళ్యాణి
వెల: రూ. 18/-

శ్రీమతి జి. భవాని కృష్ణమూర్తి
*చైతన్య
వెల: రూ. 20/-

యన్. భారతీదేవి
* ప్రేమకు జీవం... వెల: రూ. 18/-

TULASI

పద్మాలయ పబ్లికేషన్స్
రామమందిరం వద్ద, ఏలూరురోడ్డు, విజయవాడ-2



మీకు సంతానం కావాలా?

ఆపరేషన్ ఇతర వైద్య చికిత్సలతో నిరాశ చెందిన సోదర సోదరీమణులు మా సలహాచే సంతానవంతులై యిచ్చిన యోగ్యతా పత్రములు కలవు.

శ్రీ నాగార్జున మూలికా కుటీరం డాక్టరు గారికి,
మాకు వివాహమయి 6 సం॥ అయినది. తమను స్వయంగా కలసి మీ సలహాను 3 మాసములు ఆచరించుట వలన మాకు సంతానం కల్గెను.—... ప్రభాకర్, (బుకింగ్ క్లర్క్) వెంకటేశ్వరటాకీస్, విజయవాడ-10

స్వయముగా గాని, పోస్టుద్వారా గాని సంప్రదించుండి

శ్రీ నాగార్జున మూలికా కుటీరం
రైల్వే స్టేషన్ వద్ద, రామాలయం వీధి, తెనాలి
గురువారం - ఆదివారం
1 వ లైను, కేదారేశ్వర పేట, విజయవాడ-3
మంగళవారం, బుధవారం, శనివారం
ఉ॥ 12 గం॥ నుండి సా॥ 5 గం॥ వరకు

వెయ్యకముందే సుధ బిగ్గరగా నవ్వింది.

"సారీ! నీకు వుద్యోగమా? కిరీటీ! నన్ను ప్రేమించామంటూ వచ్చిన, వాళ్ళందరికీ వుద్యోగాలిప్పిస్తే మా నాన్నగారి కంపెనీ చాలదు" అంది.

కిరీటికి అసహ్యం వేసింది. అక్కడ, ఆమె ఎదుట వుండలేకపోయాడు. అప్పుడే మొదటిసారిగా అనిపించింది. అంతా ప్రేమ, త్యాగం గురించి రాస్తుంటారు. కానీ, అదంతా అబద్ధం. ఈలోకంలో ప్రేమ లేదు. ఆత్మీయత లేదు. ఉన్నదంతా స్వార్థం, ధనం. ఓ మనిషీ! నువ్వెవరినీ ప్రేమించకు. జీవితంలో నిన్ను సర్వ నాశనం చేసేది ప్రేమ. కొందరు డబ్బు పేరుతో వంచిస్తే, స్త్రీ ప్రేమ పేరుతో వంచిస్తుంది. స్త్రీని నమ్మకు. ప్రేమించకు. కిరీటికి బిగ్గరగా అరిచి చెప్పాలనిపించింది. ఆవేశాన్ని అతి కష్టంమీద అణుచుకుంటూ రోడ్డుమీద కొచ్చి నిలబడిపోయాడు.

** ** **

"ఏవిటి కిరీటీ ఆలోచిస్తున్నావు." సుధ ప్రశ్నతో ఈ లోకం లోకి వచ్చాడు కిరీటి.

సుధ-తన భర్త గురించి, బిజినెస్ గురించి, పిల్లల గురించి చెబుతోంది. కిరీటి అన్య మనస్కంగా 'వూ' కొడుతున్నాడు.

"కిరీటీ! నువ్వింత వాడివవుతావని అనుకోలేదు" అంది సుధ మళ్ళా. ఆ మాటల్లో, ఆనాడు తొందరపడి తిరస్కరించాననే బాధ కూడా మిళితమైవుంది.

కిరీటి మాట్లాడలేదు.

కారు శశాంక ఆఫీసు ముందు ఆగింది. ముగ్గురూ దిగి లోపలికెళ్ళారు. శశాంక ఆఫీసుగురించి చెబుతున్నాడు. కానీ! కిరీటిలో ఏమాత్రం వుత్సాహం లేదు. సుధ రాకతో, మాటలతో అతనిలో చిరాకు, విసుగు ప్రవేశించాయి.

ఒక గంట ఆఫీసులోవుండి, ఆ తర్వాత తిరిగి ఇంటికి వచ్చారు. సుధ కిరీటిని తన ఇంటికి భోజనానికి పిలిచింది.

శశాంక అందుకు ఒప్పుకోలేదు.

సుధ రోషంతో "నిన్నల్లా మీ ఇంట్లోనే వున్నాడుగా. కిరీటికి మేంకూడా స్నేహితులమే" అంది.

సుధ మాటకి కిరీటి నవ్వాడు.

"ఉంటేమాత్రం, ఈ రోజుకూడా వుండకూడదా? సాయంత్రం మా ఇంటికి వస్తాడులే" అన్నాడు శశాంక.

"కాదు ఇప్పుడే రావాలి. నేనింట్లో ఏర్పాట్లు చెయ్యమని చెప్పి వచ్చాను.

"కిరీటీ! నువ్వు నా ఇంటికి రావా?" సుధ అభ్యర్థించింది.

"ఇప్పుడు రాడు అని చెప్పాను కదా?" అన్నాడు శశాంక.

సుధ కిరీటివేపు చూడసాగింది. కిరీటికి ఏం చెప్పాలో తోచలేదు. ఇంతలో మేడపైనుంచి రేఖ వస్తూ-

"అంకుల్! మీరు వొచ్చేశారా! మీకోసం నేనివ్వాళ కాలేజికి శెలవు పెట్టాను" అంది దగ్గరకు వచ్చి.

"ఎందుకు రేఖా?" అన్నాడు కిరీటి నవ్వుతూ.

"మీకు లంచ్ ఏర్పాట్లన్నీ దగ్గరుండి చెయ్యాలని ఎక్కడికీ వెళ్ళలేదు. అంకుల్ నేనీపూట వంట కూడా చేశాను. నేను చేసినవి రుచి చూసి ఎలా వున్నాయో చెప్పాలి? రండి అంకుల్ చల్లారిపోతాయి పదార్థాలు. ఆంటీ! నువ్వు కూడా ఈ పూట ఇక్కడే భోజనం చెయ్యాలి" అంది రేఖ.

"నేనా?"

"అవునాంటీ! రా!" అంటూ రేఖ సుధ చెయ్యి పుచ్చుకుని-

"మీరు రండి!" అని కిరీటినీ, శశాంకనూ పిలిచింది.

"సుధ రేఖ మాటని కాదనలేకపోయింది.

ఈ సమస్య తేలిగ్గా పరిష్కారమైనందుకు కిరీటి హాయిగా వూపిరి పీల్చుకున్నాడు




రేఖ వడ్డన ప్రారంభించింది. శశాంక, కిరీటి, మాలతి, సుధ డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నారు.

"రేఖా! నువ్వూ కూర్చో. వంటావిడ వడ్డిస్తుందిలే" అన్నాడు శశాంక.

"ఉహూ! నేను చేసినవి నేనే వడ్డించాలి" అంది రేఖ.

"ఇవన్నీ నువ్వే చేశావా?" సుధ అడిగింది.

"ఈ స్వీట్స్, గుత్తి వంకాయ కూర, కొబ్బరి చట్నీ, పకోడీ నేనే చేశాను" అంటూ ముందు అవి వడ్డించింది.

"ఎలా వున్నాయో చెప్పాలి అంకుల్!"

"కిరీటి రుచిమాసి "చాలా బావున్నాయి" అన్నాడు.

"రేఖా! నువ్వు మెడిసిన్‌లోనేకాదు వంటలో కూడా ఎక్స్‌పర్ట్‌వే నన్నమాట!" అంది సుధ.

"రేఖా! బొంబేలో రోజూ స్వీట్స్ తిని విసుగెత్తిన నాకు ఇవి ఎంతో బాగున్నాయి. మళ్లా మళ్ళా తినాలని పిస్తోంది" అన్నాడు కిరీటి.

ఆ మాటకి రేఖ ఆనందపడిపోయి "థాంక్యూ అంకుల్" అంది.

భోజనమయ్యాక శశాంక ఎవరో వస్తే మాట్లాడుతూ కూర్చుండిపోయాడు.

కిరీటి మేడమీద తన గదిలోకి వెళ్ళాడు. సుధ అతని వెంటే వచ్చింది. కిరీటి సోఫాలో కూర్చుని సిగార్ వెలిగించుకున్నాడు. సుధ అతని ప్రక్కనే కూర్చుని-

"కిరీటీ! నువ్వు చాలా అదృష్టవంతుడివి" అంది అతని కోటుని తాకుతూ.

కిరీటి వెనక్కి వాలి నవ్వి వూరుకున్నాడు.

"కిరీటీ! మళ్ళా పాతరోజులు తిరిగి వస్తే ఎంత బాగుండును."

"ఎందుకు?"

"కిరీటీ! నేను జీవితంలో చాలా పెద్ద పొరపాటు చేశాను"

ఆ పొరపాటేమిటో కిరీటికి అర్థమైంది. సుధ ఇలా పశ్చాత్తాప పడడం కిరీటికి చాలా ఆనందంగా వుంది. సుధనోటినుంచి ఇలాంటి మాటలే ఇంకా ఇంకా వినాలని పించింది.

"ఏవిటా పొరపాటు సుధా?" కిరీటి అడిగాడు.


సుధ ఆ మాటకి సమాధానం చెప్పకుండా మాట మారుస్తూ-

"కిరీటీ! నువ్వు విదేశాలన్నీ తిరిగావా?" అనడిగింది.

"ఆ...బిజినెస్ పనులమీద ప్రపంచమంతా తిరిగాను."

"కిరీటీ! నేను బొంబాయి చూడాలని ఎన్నాళ్ళనుంచో అనుకుంటున్నాను. కానీ ఇప్పటివరకూ కుదరలేదు."

"ఏం. మీ ఆయన్ని అడగలేకపోయావా?"




నీలిమేఘం

'ఆయనా, కనీసం సినిమాక్కూడా రారు. క్లబ్బూ, పేకాటా, స్నేహితులు ఇవుంటే చాలు'' అంది సుధ నిట్టూరుస్తూ.

ఆ మాటకి కిరీటి నవ్వుకున్నాడు.

''కిరీటీ! నువ్వెప్పుడెడుతున్నావు బొంబే?''

''ఎల్లుండి ఉదయం ఫ్లైట్‌కి.''

''టికెట్ బుక్ చేయించుకున్నావా?''

''లేదు. రేపు చేయించుకుంటాను.''

సుధ కిరీటికి దగ్గరగా జరిగింది. ఆమె మెత్తటి శరీరం తగులుతూంటే కిరీటికి కంపరంగా వుంది. సుధ అతని భుజం మీద చెయ్యివేసి-''కిరీటీ! నాకు బొంబే చూడాలని వుంది. నీతో నేనుకూడా రానా?'' అనడిగింది.

''మీ ఆయన వూరుకుంటాడా?''

''ఊరుకోక ఏంచేస్తాడు. అయినా, నాగురించి ఆయనకంత శ్రద్ధ లేదులే. నేనెలా పోయినా ఆయనకక్కర్లేదు''

ఆ మాటల్లో నిరాశా, దిగులూ తొంగిచూశాయి.

''కిరీటీ! నవ్వెందుకింకా పెళ్ళి చేసుకోలేదు.''

''బిజినెస్ పనుల్లో తీరక. అనుకున్నది సాధించే వరకూ చేసుకోకూడదనుకున్నాను. ఇప్పుడు నా లక్ష్యం నెరవేరింది. లక్షలు సంపాదించాను. ఇప్పుడు పెళ్ళి చేసుకుని జీవితంలో స్థిరపడాలనుకుంటున్నాను''

''నిజంగానా?''

''ఏం వద్దంటావా?''

''అబ్బే...అది...కాదు...'' అంటూ సుధ ఆగిపోయింది.

''మా ఆయనకి విడాకులిస్తాను. నన్ను పెళ్ళిచేసుకో'' అని అంటుందేమోనని అనుకున్నాడు.

ఆమెనింకా వుడికించాలనిపించింది.

''సుధా! నీలా అందంగా వుండే అమ్మాయిని చేసుకోవాలనుకుంటున్నాను. నీ ఎరికలో ఎవరన్నా వుంటే చెప్పు. బీద వాళ్ళయినా ఫర్వాలేదు''

సుధ, అతనివేపు ఓసారి ఓరగా చూసి తలదించుకుంది.

ఐదు నిమిషాలు గడిచాయి.

1986 సూపర్ హిట్ నవలలు!
ఈయేటి మేటి రచయిత్రి



రావినూతల సువర్ణాకన్నన్ నవలా స్రవంతి
★ భుక్-భుక్-భుక్ (స్వాతివీక్లీ సీరియల్)........ 26/-
★ కాంచన సౌధం (ఆంధ్రపత్రిక వీక్లీ సీరియల్)........ 22/-
★ పాతాళగంగ (ఆంధ్రజ్యోతి వీక్లీ సీరియల్)........ 20/-
★ క్లిక్-క్లిక్-క్లిక్ (ఆంధ్రజ్యోతి వీక్లీ బహుమతి నవల)........ 22/-
★ అజేయుడు (సినీ-డైరెక్ట్ నవల) (సువర్ణాకన్నన్ & నందం రామారావు)........ 24/-
★ నిశ్శబ్దం........ 22/-
★ మమతల ఊయల........ 19/-
★ మరచిపోకు నేస్తం (కలువబాల సీరియల్)........ 18/-
★ నిజాలు నీడలు........ 20/-
★ అలకల కొలికి (స్వాతి మంత్లీ సీరియల్)........ 22/-
లక్ష్మీ పబ్లికేషన్స్
రామమందిరం వీధి, విజయవాడ-2

ఇన్నోవేషన్స్‌లో
V.I.P. సూట్‌కేస్ కొనండి!
బ్రీఫ్‌కేస్ ఉచితంగా పొందండి!
33 శాతం ఆదా చేయండి!

విజయవాడ షోరూమ్స్: * బీసెంట్ రోడ్, ఫోన్: 77117
* చల్లపల్లి బంగళా, ఫోన్: 64024
* వన్ టౌన్ హెడ్ పోస్టాఫీసు ఎదురుగా, ఫోన్: 75119
గుంటూరు: బ్రాడీపేట, మెయిన్ రోడ్, ఫోన్:22107
విశాఖపట్టణం: T.S.R.కాంప్లెక్స్, స్టేషన్ రోడ్, ఫోన్:61896
విజయనగరం: బాలాజీ కాంప్లెక్స్, M.G. రోడ్.
హైదరాబాద్: * రిడ్జ్ హోటల్ రోడ్, ఫోన్: 233655
* పోస్టాఫీసు ఎదురుగా, చిక్కడపల్లి.
* గ్రామర్ స్కూల్ ఎదురుగా, అబిడ్స్.

ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు.

"సుధా! కాస్సేపు పడుకుంటాను" అన్నాడు కిరీటి బద్దకంగా ఆవలిస్తూ.

"అలాగే. నేను సాయంత్రం వస్తాను. అన్నట్టు కిరీటీ! నీ ఫ్రెండ్ శేఖర్ ఇక్కడే వున్నాడు. నీకు తెలుసా?" అంది సుధ సోఫాలోంచి లేచి.

"శేఖరా?"

"అవును. ఏదో ఆఫీసులో పనిచేస్తున్నాడు. ఆ వివరాలు నాకు తెలియవు. ఇక నేను వెడుతున్నాను" అని వెళ్ళిపోయింది సుధ.

శేఖర్ ఇక్కడే వున్నాడా?

అతని మనస్సు నిండా శేఖరమే ఆక్రమించాడు.

** ** **

శేఖర్ కూడా కిరీటి క్లాస్‌మేటే.

అతను చాలా నెమ్మదిగా వుండేవాడు. తన చదువేమిటో? తనేమిటో? అంతే. ఇంకే విషయం పట్టించుకునేవాడు కాదు.

శశాంకా, ప్రభాకర్ కోరి కిరీటితో స్నేహం చేస్తే, కిరీటి మాత్రం శేఖర్‌తో స్నేహం చెయ్యాలని కోరుకునేవాడు.

శేఖర్ మంచి రచయిత కూడా. కాలేజీ మేగ్జయిన్లో కథలూ, గేయాలూ రాసేవాడు.

శేఖర్‌ని చూసి కిరీటిక్కూడా కథలు రాయాలని, రచయిత కావాలని అనిపించింది.

ఒక కథ రాసి శేఖర్‌కి చూపించాడు. అదే మొదలు అతనితో మాట్లాడడం. ఆ సమయంలో శేఖర్ లైబ్రరీలో కూర్చుని చదువుకుంటున్నాడు. కిరీటి అతని ప్రక్కన కూర్చుని మెల్లగా వచ్చినపని చెప్పాడు. శేఖర్ చిన్నగా నవ్వి-"ఇలా ఇవ్వండి. చదివి చెబుతాను" అన్నాడు.

కిరీటి తను రాసిన కథ యిచ్చాడు. శేఖర్ చదువుతుంటే కిరీటి అతని ముఖంలోకి ఆత్రంగా చూస్తూ కూర్చున్నాడు. శేఖర్ అంతా చదివి-

"ఇది మీరు స్వంతంగా రాసిన కథేనా?" అని అడిగాడు.

"అవునండి!"

"మీరేమీ అనుకోకండి. ఈ కథ బాగాలేదు"

"కిరీటికి చెప్పరాని వుక్రోషం కలిగింది. శేఖర్ జెలసీతో అలా అంటున్నాడని అనుకున్నాడు. వెంటనే లేచి అతని చేతిలోని కాయితాలు లాక్కున్నాడు.

"థాంక్సండీ. మీకు శ్రమ ఇచ్చాను. "అంటూ చరచరా బయటకొచ్చేశాడు.

తరువాత ఆ కథని పత్రిక్కి పంపాడు కిరీటి. నెలరోజుల్లో ఆ కథ తిరిగొచ్చింది. అప్పటిగ్గానీ అతని మైకం వదల్లేదు. శేఖర్ మీద పెంచుకున్న కోపం తగ్గి అతని మీద సదభిప్రాయం ఏర్పడింది. అంతకు ముందు శేఖర్ పలుకరించినా మాట్లాడేవాడు కాదు. ఆ కథ తిరిగొచ్చిన రోజున తనే వెళ్ళి శేఖర్‌తో ఆ విషయం చెప్పాడు కిరీటి.

శేఖర్ నొచ్చుకుని "మీరేం బాధ పడకండి కిరీటీ! కథలు ఎలా రాయాలో నేను చెబుతాను" అన్నాడు.

కానీ, కిరీటిలో అప్పటికే కథలు రాయాలన్న వుత్సాహం చచ్చిపోయింది.

"వద్దండి. నాకు కథలు రాయాలని లేదు. మీరు మంచి రచయితగా పేరు తెచ్చుకోండి. అది చాలు నాకు" అన్నాడు.

కిరీటి మాటలకు శేఖర్ చలించిపోయాడు.

అది మొదలు వారి స్నేహం మరింత బలపడింది. ప్రతి సాయంత్రం ఇద్దరూ కూర్చుని సాహిత్యం గురించి చర్చించుకునేవారు. శేఖర్ తను రాసిన కథలు కిరీటికి చదివి వినిపించేవాడు. కిరీటి విని తనకు తోచిన సలహాలు ఇస్తూవుండేవాడు. ఇక, ఆ తర్వాత డిగ్రీ అయ్యాక ఆరేళ్ల వరకూ శేఖర్ విషయమేమీ కిరీటికి తెలీదు.

కిరీటి బొంబేలో బిజినెస్ మొదలెట్టాక ఒకసారి ఇంటికి వచ్చాడు. అప్పుడొక విషయం తెలిసిందతనికి.

కిరీటి చెల్లెలు ఎవరిచేతనో దారుణంగా మోసగింపబడితే శేఖర్ ఆదుకున్నాడు.




అమలాపురం సాహితీ మిత్రమండలి ఆధ్వర్యాన జూన్ 15వ తేదీన జరిగిన మహాకవి శ్రీశ్రీ తృతీయ వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న మండలి అధ్యక్షులు శ్రీ రేకపల్లి శ్రీనివాసమూర్తి; డాక్టర్ సుమనశ్రీ, శ్రీ కన్నెబోయిన వెంకటేశ్వరరావు, శ్రీ నల్లా నరసింహమూర్తి ఫోటోలో వున్నారు.

అంతేకాదు, తన బంధువుల్లో మంచి కుర్రాడిని చూసి కిరీటి చెల్లెలనిచ్చి పెళ్ళి చేశాడు. ఆ పెళ్లికోసం శేఖర్ తన నవల మీద వచ్చిన డబ్బు ఐదువేలు వుంటే ఖర్చు పెట్టాడు.

తన తల్లి దండ్రులు ఈ విషయాలు చెబుతుంటే కిరీటి నమ్మలేకపోయాడు. వాళ్ళకి నిజమైన కొడుకు తనుకాదు. శేఖరే! అనుకున్నాడు కిరీటి.

శేఖర్ పేర ఐదువేలు డ్రాఫ్టు పంపించాడు కిరీటి. కానీ, శేఖర్ ఆ డ్రాఫ్టు తిరిగి పంపిస్తూ-"నీ చెల్లెలు నాకు మాత్రం చెల్లెలు కాదా?" అన్నాడు.

అది చదివాక శేఖర్ మీద అభిమానం, గౌరవం రెట్టింపయ్యాయి.

తనింత ప్రపంచాన్ని చూశాడు. ఎక్కడకు వెళ్ళినా స్వార్థపరులే కన్పించారు. శేఖర్‌లాంటి వ్యక్తి ఎక్కడా కనబడలేదు.

శేఖర్ ఇక్కడున్నాడని తెలియగానే అతన్ని ఎప్పుడు చూద్దామా అని కిరీటి మనస్సు ఆరాట పడసాగింది.

** ** **

కిరీటి నిద్ర లేచే సరికి సాయంత్రం నాలుగయింది.

టీ త్రాగి, ముఖం కడుక్కుని డ్రెస్ చేసుకున్నాడు. ఆ తర్వాత రేఖ స్నేహితురాళ్ళతో మాట్లాడి, ప్రభాకర్‌తో కలిసి అతనింటికి బయలుదేరాడు.

మధ్య దారిలో కిరీటి ప్రభాకర్‌ని అడిగాడు-

"ప్రభా! నీకు శేఖర్ ఇల్లు తెలుసా?"

"తెలుసు."

"ఓ సారి అతనింటికి తీసుకెళ్లు."

"ఇప్పుడా?"

"అవును. శేఖర్‌ని చూడాలి."

"ప్రభాకర్‌కి ఇష్టం లేకపోయినా కిరీటికోసం తప్పని సరిగా ఒప్పుకున్నాడు. కారు శేఖర్ ఇంటిముందు ఆగింది.

(ఇంకా వుంది)

